ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

❖ రాష్ట్రంలో 600 మండల ప్రజా పరిషత్‌లకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తి అయ్యాయని ఎన్నికల సంఘం వెల్లడించింది.

❖ విశాఖపట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 9 నుండి జనవరి 7వ తేదీ వరకు జరగనున్నాయి.

❖ తీవ్ర తుపాను అక్వాన్.. రేపు తీరం దాటనున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

==========

వైద్య విద్యలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన విద్యార్థినులు అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ రాష్ట్ర కోటా సీట్లలో ఎక్కువగా అమ్మాయిలే సీట్లు సాధించడం వారి ప్రతిభ, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర కోటా సీట్లలో 61.34 శాతం యువతులే దక్కించుకోగా.. యువకులు 38.66 శాతానికే పరిమితమయ్యారని తెలిపారు. విద్యార్థినుల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసం, ఆశయాలకు ఇది ప్రతిబింబమని హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఆడబిడ్డకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వారు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని.. విజయాలు సాధిస్తూ నాయకత్వ స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహిస్తామని సామజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చేసిన ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

==========

రాష్ట్రంలో 600 మండల ప్రజా పరిషత్‌లకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తి అయ్యాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు.. రాష్ట్రంలో మొత్తం 659 మండల ప్రజా పరిషత్‌లకు గాను 600 మండల ప్రజా పరిషత్‌లలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తయ్యాయని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మిగిలిన 59 మండల ప్రజా పరిషత్‌లలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు పూర్తికావాల్సి ఉందని ఆయన వెల్లడించారు. వీటిలో 34 మండల ప్రజా పరిషత్‌లలో అధ్యక్ష ఎన్నికలు, 59 మండల ప్రజా పరిషత్‌లలో ఉపాధ్యక్ష ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మండల ప్రజా పరిషత్‌ల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలను రేపు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు.

==========

గోదావరి పుష్కరాల ధార్మిక కార్యక్రమాలపై ఆధ్యాత్మికవేత్తలు, వేదపండితులతో దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఈరోజు రాజమహేంద్రవరంలో సమావేశం నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. పుష్కరాల కోసం ఆరు జిల్లాల పరిధిలో 126 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని, 2027 మార్చి నాటికి ఆ పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. పుష్కరాల సమయంలో పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. 12 చోట్ల గోదావరి నదీ హారతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని రామచంద్రమోహన్ పేర్కొన్నారు. పుష్కరాలకు గోదావరి తీరంలో సూర్యదేవాలయం, బృహస్పతి ఆలయం నిర్మిస్తామన్నామని తెలిపారు.

==========

అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, వాగులు వంకల సమీపంలో నివసించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. తుఫాన్ కారణంగా ఏవైనా ఇబ్బందులు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం 93929 17709 నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు.

==========

57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం రేపటి నుంచి ఈనెల 28వ తేదీ వరకు గోవాలో జరగనుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ పోటీ విభాగంలోని చిత్రాల ప్రదర్శనలు సినీ ప్రేక్షకులను ఆకట్టుకోనున్నాయి. ఈ ఏడాది ఎడిషన్‌లో అంతర్జాతీయ పోటీ విభాగానికి ఎంపికైన చిత్రాల జాబితాను నిర్వాహకులు ప్రకటించారు. ఈ విభాగంలో భారతీయ, అంతర్జాతీయ దేశాలకు చెందిన మొత్తం 15 ఫిక్షన్ ఫీచర్ చిత్రాలు పోటీపడనున్నాయి. ప్రతి చిత్రం తనదైన ప్రత్యేక కథనం, వినూత్న దృక్పథంతో వెండితెరపై విభిన్నమైన సినీ అనుభూతిని అందించనుంది. ప్రముఖ సినీ దర్శకుల చిత్రాలతో పాటు, నూతన దర్శకుల సృజనాత్మక ప్రతిభను చాటిచెప్పే చిత్రాలు కూడా ఈ పోటీలో చోటు సంపాదించాయి. సినిమా కథనాల్లో సరికొత్త ప్రయోగాలు, సృజనాత్మకతకు ఈ చిత్రాలు వేదికగా నిలవనున్నాయి.

విరామం

==========

విశాఖపట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 9 నుండి జనవరి 7వ తేదీ వరకు జరగనున్నాయి. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, త్వరితగతిన దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి అధికారులను ఆదేశించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర

మాసోత్సవాల ఏర్పాట్లపై ఆమె ఈరోజు కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ సంవత్సరం మాసోత్సవాల్లో ఐదు గురువారాలు రానుండటంతో, భక్తుల రద్దీ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా సాధారణ రోజుల్లోనూ రోజుకు 10 వేల నుండి 20 వేల మంది వరకు, గురువారాల్లో 34 వేల నుండి 60 వేల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున.. పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ ఆదేశించారు.

==========

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపాను అక్వాన్ గడిచిన 6 గంటల్లో గంటకు 13 కిలోమీటర్ల వేగంతో ఉత్తర దిశగా పయనించిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) మేనేజింగ్ డైరెక్టర్, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) సిఈవో ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రేపు మధ్యాహ్నానికి నరసాపురం- పూరీ మధ్య గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని.. అందుచేత మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఇక దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉత్తరాంధ్ర తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

==========

గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. డాక్టర్ వి.ఎస్ కృష్ణా గ్రంథాలయంలో `గ్రంథాలయ వారోత్సవాల`లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పుస్తక ప్రదర్శనను ఆయన ఈరోజు తిలకించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలో ఉంచిన ఉత్తరాంధ్ర కథలు, తెలుగు మాండలికాలు, క్రీడలకు సంబంధించిన పుస్తకాలను ఆసక్తిగా చదివారు. అనంతరం పుస్తక ప్రదర్శన తిలకించడానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా.. పుస్తక జ్ఞానం ఎంతో విలువైనదన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించడం, అక్కడ ఉన్న వైవిధ్యమైన పుస్తకాల నుంచి జ్ఞానాన్ని పొందే ప్రయత్నం జరగాలని సూచించారు. యువతను గ్రంథాలయాల వైపు నడిపించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు.

==========

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 031 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 990 పాయింట్ల లాభంతో 83 వేల 021 వద్ద ముగిసింది. నిఫ్టీ 286 పాయింట్లు లాభపడి 25 వేల 514 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 93 రూపాయల 29 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3 వేల 730 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==========

రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని చిత్తూరు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ.మురళి తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానం ద్వారా ఎరువుల విక్రయాలు, పంపిణీ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ మొబైల్ ఫోన్లలోని గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, రైతు గుర్తింపు సంఖ్య లేదా ఆధార్ నంబర్ ద్వారా ఓటీపీ ధృవీకరణతో యాప్‌లోకి ప్రవేశించాలని.. అనంతరం భూమి వివరాలను, సాగు చేస్తున్న పంట వివరాలను నిర్ధారించాలని చెప్పారు.

==========
==========